# ముగ్గురు మిత్రులు

భారతదేశానికే భూ పోరాటాల వారసత్వాన్నందించిన తెలంగాణా గడ్డలో అదో గ్రామం. రజాకారు పోరాటాల విరమణ జరిగి పాతికేళ్ళయింది. ఈ పాతికేళ్ళూ ఆ గ్రామం అవ్వ బాంచెన్, అయ్య బాంచెన్ సంస్కృతిలోనే బతికింది. ఈ పాతికేళ్ళలో ఒకింటికీ నాలుగిళ్ళన్నట్టుగా జనాభా పెరిగినా ఊరు మాత్రం చెప్పుకోదగ్గంతగా పెరుగలేదు. అందుక్కారణా లనేకమున్నాయి. చదువుకొని ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్ళు పట్టణాల్లో స్థిరపడ్డారు. బతుకుదెరువు లేనివాళ్ళు పట్టణాలకు వలసపోయారు. కొంత మంది భీమండి, బొంబాయి, షోలాపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

కరీంనగర్ జిల్లాలోని ఆ గ్రామంపై రజాకారు వ్యతిరేక పోరాటాల ప్రభావం గణనీయంగా లేదు. కాని, రెండవసారి ప్రారంభమైన భూ పోరాటాల ప్రభావం ఉధృతంగా వుంది. ఉత్తర తెలంగాణాలో భూ పోరాటాలు ప్రారంభమైన సమయంలో ఆ ఊళ్ళో పుట్టారా ముగ్గురు. వాళ్ళ పేర్లు రాజయ్య, బ్రహ్మం, నర్సింగు. ఆ ముగ్గురు తండ్రులవీ దిగువ మధ్యతరగతి కుటుంబాలే. ఇండ్లూ ఒకే వాడకున్నాయి. పోరాటాలు పెరుగుతున్నకొద్దీ వాళ్ళు పెరిగారు. తెలంగాణా పల్లెలు అగ్నిగుండాలుగా మారిన సమయంలో నూనూగు మీసాల నూత్న యవ్వనంలో కడుగుపెట్టారు.

ఒకే వయసు, ఒకే ఆర్థిక స్థితిగతులున్న ఆ ముగ్గురూ కలిసి చదువుకున్నారు... కలిసి ఆడుకున్నారు... ప్రాణస్నేహితులుగా మసులుకుంటున్నారు. బాల్యం నుంచీ వాళ్ళు ఒకే కంచంలో తినడం, ఒకే మంచంలో పడుకోవడమన్నంత సన్నిహితంగా వుంటున్నారు. ఆ ముగ్గురూ ఇంటర్ వరకు చదివారు. చదువబ్బక, చదివించే వసతిలేక ఇంకా అనేక కారణాల వల్ల ఆ ముగ్గురూ చదువాపారు. వాళ్ళకు పెద్ద కోర్కెలేం లేవు. అతి మామూలుగా బట్ట పొట్టకు బతికితే చాలు ననుకుంటున్నారు. అందుకే జీవితంలో స్థిరపడటానికి ప్రయత్నిస్తున్నారు.

తీవ్రవాదమో, ఎత్తుగడలో భాగమో, ఏది హింసో, ఏది ప్రతిహింసో, ఏది ఎన్‌కౌంటరో, ఏది హత్యో సామాన్య మానవుడికైతే తెలియదుకాని పోలీసులు, ఉద్యమకారులు ఒకర్నొకరు చంపుకుంటున్న సమయంలో ఆ ముగ్గురింకా తమతమ జీవితాల్లో స్థిరపడలేదు. ఆ ప్రయత్నంలోనే వున్న ఆ ముగ్గురూ ఓ రోజు కలుసుకున్నారు. ఆత్మీయంగా మనసు విప్పి మాట్లాడుకున్నారు. తమ భవిష్యత్తుల గురించి చర్చించుకుంటున్నారు.

"దురదృష్టం... మన ముగ్గురమూ బాగా చదువలేకపోయాం" అన్నాడు రాజయ్య.

"ఇంటర్ చదవడమే మహా ఎక్కువైంది మనకు... నావి ఇంకో రెండు సబ్జెక్టులున్నాయి... నా నుంచి కాదని వదిలిపెట్టాను" అన్నాడు నర్సింగు

"చదువంటేనే బతుకుతారాపటు. మనకన్నా ఈ మాత్రం చదువుంది. ఇదీ లేనివాళ్ళెంతో మందున్నారు..." అన్నాడు బ్రహ్మం.

"మనం చిన్నతనం నుండీ ప్రాణస్నేహితులం... కాని, మనలో ఒక్కరైనా బాగా చదువలేకపోయాం."

"నిజమే రాజయ్యా! కాని, నాకైతే చదివిన వరకు చాలనిపిస్తుంది. మన ప్రాంతమంతా ఇప్పుడు అగ్నిగుండంలాగే వుంది. ఎప్పుడెవరి కేమవుతుందో తెలియకుండా వుంది. చదువుకుంటావని పోయి ఎంతోమంది అన్నల్లో కలిసిపోయారు" అన్నాడు బ్రహ్మం.

"అవును... నాకా మాట వింటేనే భయం. ఎవరి పనులు వాళ్ళు చేసుకోక ఎందుకీ తండ్లాటలన్నీ...?"

"నీలాగే అందరుండాలంటే ఎలా వుంటారు నర్సింగు! నన్ను ముట్టుకోకు నా మాలకాకన్నట్టు బతకడం అందరికి సాధ్యమవుతుందా...?"

రాజయ్య మాటలు విని ముఖం చిన్నబుచ్చుకున్నాడు నర్సింగు.

"సరేకాని... నువ్వేం చేద్దామనుకుంటున్నావు నర్సింగు?"

"నీకు తెలువందేముంది బ్రహ్మం? మా కున్న భూమే అతి తక్కువ. నా చదువుకు నౌకరేం రాదు. బొగ్గు బావి పనికెళ్దామన్నా కొన్నేండ్ల నుంచి ఎవర్నీ తీసుకోవడం లేదు. నాకు పెద్ద కోర్కెలేం లేవు. నాకు భూమ్మీదున్న ప్రేమ మీకు తెలిసిందే. ఊర్ను విడిచిపెట్టి ఎక్కడికో బతుకపోవడం నా కిష్టం లేదు. అందుకే భూమిని దున్నుకుంటూ బతుకుతాను. బట్ట పొట్టకు చావేముండదు. వృద్ధాప్యంలో వున్న మా అమ్మానాన్నలకు దగ్గరున్నట్టుంటుంది... మా అన్న ఉద్యోగం దొరుకగానే అందర్నీ కాదని చెంగోబిల్లన్నడు కదా! అయన్నుంచి మేమేమాశించినా ఫలితం లేదు. మా అన్న చదువులోనూ జీవితంలోనూ హుషారే. అందువల్ల నేనే ప్రయత్నాలు చేయదలుచుకోలేదు. ఉన్న వ్యవసాయం చూసుకుంటూ బతుకుతాను..."

నర్సింగు మాటలు విన్న బ్రహ్మం ముఖం ముడతలు పడింది.

"ఏదో బాగా ఆలోచిస్తున్నట్టున్నావు బ్రహ్మం! ఏం సంగతి?"

"ఏం లేదు రాజయ్యా! పరిస్థితులను చూస్తుంటే నాకు ఆశ్చర్యమనిపిస్తుంది. మన ప్రాంతంలో ఓ దిక్కు ఉద్యమాలున్నాయి... మరో దిక్కు ఘోరమైన మూఢనమ్మకాలున్నాయి... కట్నకానుకల వేధింపులున్నాయి... ఇంకో దిక్కేమో ఉద్యోగాలయి ఓ తీరుగా బతుకుతున్నవాళ్ళు ఊళ్ళు వదిలి పట్టణాల్లో స్థిరపడుతున్నారు. మరో దిక్కు అన్నల భయానికి ఊళ్ళు వదిలిన దొరలు, భూస్వాములు... చాలా ఇండ్లల్లో ఇప్పుడు ముసలి తల్లిదండ్రులే వుంటున్నారు... లేదా, వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్నవాళ్ళు ... కాదంటారా?" అన్నాడు బ్రహ్మం.

"పెద్ద ఆరిందాలా అనుభవజ్ఞుడిలా మాట్లాడావు బ్రహ్మం," నువ్వు. నువ్వన్న

మాటల్లో నూటికి నూరుపాల్లు నిజాలున్నాయి... అయితే మనం వ్యక్తుల్ని తప్పు పట్టడం కాదు చేయాల్సింది... ఈ చదువుల్లో, ఈ వ్యవస్థలోనే ఆ లోపముంది... అందుకోసం వ్యవస్థను తప్పుపట్టాలి..."

రాజయ్య మాటలకు కొంత భయం వేసిందా ఇద్దరికి.

"నన్ను పెద్ద మాటలు మాట్లాడుతున్నానంటూ నువ్వయితే మా కర్థంకాని మాటలే మాట్లాడావు... నువ్వు కొంత జాగ్రత్తగా వుండాలి రాజయ్యా..! నీ ఆలోచనలు ఎటెటో పోతున్నాయి..."

"వాస్తవాలెప్పుడూ కఠోరంగానే వుంటాయి బ్రహ్మం...!"

"అంత పెద్దమాటలెందుకు తియ్ రాజయ్యా! మనం సామాన్యులం... అతి సామాన్యంగా బతుకుందాం... సరేగాని! నర్సింగం... నువ్వదృష్టవంతుడివి. ఏ ఆశల జోలికీ పోకుండా వున్న ఊళ్ళో భూమిని దున్నుకుంటూ బతుకుతానని నిర్ణయించుకున్నావు. ఊళ్ళోనే వుందామని కోరికున్నా పుట్టి పెరిగిన నేల మీద బతికే అదృష్టం, అవకాశం ఎంతమంది కుంటుంది? అక్షరం ముక్కలొచ్చిన ప్రతివాడూ ఊళ్ళొదిలిపోతున్న సమయంలో నువ్వు ఊర్నే పట్టుకొని ఉంటాననడం గొప్ప విషయమే..." అన్నాడు బ్రహ్మం.

"గొప్పా కాదు... మన్నూ కాదు... నాకు వేరే విధంగా బతికే అవకాశం లేదు... పోగా, ఊళ్ళో కొద్దో గొప్పో భూముంది. కాబట్టి నేను వ్యవసాయాన్ని వృత్తిగా ఎందుకున్నాను... సరేకాని, నువ్వేం చేయబోతున్నావు?"

"బ్రహ్మం కేంది? తండ్రి చేస్తున్న బంగారం పనుంది కదా...? అదేమన్న తక్కువ ఆదాయమున్న పనా...? నగలు చేయడంలో నేర్పు సంపాదిస్తే ఆ పనితో బతుకొచ్చు... కూలినాలి వ్యవసాయ ప్పనుల్లో ఒళ్ళు వంచి పనిచేయాల్సిన అవసరమేం లేదు కదా...! ఇంట్లో కూచొని చేసుకునేదేనాయె... పోగా, గోళ్ళలో బంగారమిరికించుకునే టెక్నిక్ వుండనే వుంది. తులానికి ఐదారువేల ధరున్నప్పుడు ఓ గురిజెత్తు కొట్టేసినా అరవై రూపాయిలు. ఇంకేం కావాలి మరి...? బ్రాహ్మణులకు, విశ్వబ్రాహ్మణులకు చదువుకొని ఉద్యోగం రాకున్నా నీడపట్టుకు బతికే అవకాశాలున్నాయి..." అన్నాడు రాజయ్య.

బ్రహ్మం ముఖం కొంచెమెర్రబడింది.

"నీలాంటివాడు కూడా ఇలాంటి అభిప్రాయంతో వుంటే ఎలా రాజయ్యా? తరతరాలుగా మా వాళ్ళీ పని చేస్తూ బామ్ముకున్నదేంటి? గోర్లలో బంగారమిరికించుకొని సంపాదించి మేమెన్ని బంగ్లాలు కట్టినం...? అయినా, ఇప్పుడు బంగారాన్ని కొంటున్నదెవరు? రోజురోజుకూ బతుకు దుర్భరమవుతుంటే బంగారం కొని నగలు కూడా చేయిస్తున్నారా? ఈ వృత్తిలో బతుకలేకనే కదా చాలా మంది వేరే పనులు చూసుకుంటున్నారు."

"గోర్లలో ఇరికించుకోవడమన్నది నేను హాస్యానికన్నమాట... కాని, బంగారం వాడకం ఇప్పుడేమన్నా తగ్గిందా? ప్రతివాళ్ళూ ఎన్నో కొన్నైనా నగలు చేయించుకుంటున్నారు కదా...!"

"నువ్వన్నది నిజమే కాని ఇప్పుడు దీని వాడకం పల్లెల్లో తగ్గింది. దేవుడూ, పూజల్లాగే ఇది కూడా ఇప్పుడెక్కువగా పట్నాలకే పోయింది. అయితే, ప్రతివాళ్ళూ ఎంతో కొంత బంగారముంచుకోవడమన్నది ఇప్పటికీ వుంది. కాని, ఆ పని చేస్తూ బతకడం సాధ్యం కాదనిపిస్తుంది. పోగా నా కెందుకో అపనంటే ఇష్టం లేదు. ఎంత చిన్నదైనాసరే నౌకరీ సంపాదించుకోవాలనుకుంటున్నాను... ఆ ప్రయత్నంలోనే వున్నాను."

"ఇంటర్ అత్తెసరు మార్కులతో పాసైన నీకు ఏం నౌకరొస్తుందోయ్ బ్రహ్మం?... నౌకరంటే ఒకరికింద పనిచేయడమే కదా...! దానికంటె స్వతంత్రంగా బతికే వృత్తులే నయం. నన్నడిగితే రైతే రాజన్నారు..."

రాజయ్య మాటల్తో గంయ్‌మని లేచినట్టున్నాడు నర్సింగు.

"అవును... రైతును మించిన మారాజు లేడు... ఇవి చెవిలో పూలు పెట్టే మోసకారి మాటలు. ఇప్పుడు వ్యవసాయాలు నడిచే పరిస్థితులెక్కడున్నాయి? మంచి మంచి వ్యవసాయాలన్నీ మూలకు పడ్డాయి. కూలీలు, పాలేర్ల జీతాలు విపరీతంగా పెరిగాయి. వ్యవసాయం చేసుకోవడం కంటె కూలీపని చేసుకోవడం నయం. వ్యవసాయప్పనిలో రోజు కూలీ పడితే ఎక్కువ... రైతట, రాజట!..."

"నేనలా మాటవరుసకన్నాను కాని, రైతులు బాగా బతుకుతున్నారని కాదు. ఈ బ్రోకర్లను పోషించే సమాజంలో రెక్కలు ముక్కలు చేసుకొనే రైతు పరిస్థితి అధ్వాన్నంగానే వుంది. అయినా, నువ్వు వ్యవసాయాన్నే చేస్తానంటున్నావు... నీలాంటి వాళ్ళన్నా ఈ పని చేయకపోతే వ్యవసాయాలు మూలకుపడే పరిస్థితులున్నాయి. ధొరలు, భూస్వాములు ఊళ్ళొదిలడం వల్ల పెద్ద వ్యవసాయాలు కుప్పకూలిన మాట నిజమే... కాని, అందువల్ల ఏం నష్టం జరిగింది? నిజానికి ఇప్పుడు భూమి స్వయంగా దున్నుకునేవాడి చేతిల్లోకే పోతుంది. నాకైతే ఇది మంచి పరిణామమే అనిపిస్తుంది..."

"రాజన్నా! నీకు మన ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాల మీద సదభిప్రాయం, సానుభూతి వుంది కాబట్టి, నీకలా అనిపిస్తుంది. కాని, కూలి రేట్లన్నీ విపరీతంతగా పెరగడం వల్ల, అల్లర్ల వల్ల చిన్న వ్యవసాయాలు కూడా దెబ్బతినడంలేదా...? దీనివల్ల ఎవరికి లాభమవుతుంది? భూములు పెద్దోల్లవయితే మాత్రం బీడుగా వుండడం వల్ల పంట నష్టం కావడం లేదా? వాట్ని అమ్ముకోనియ్యరైరి... దున్నుకోనియ్యరైరి..." అన్నాడు నర్సింగు.

"నర్సింగూ! నువ్వమాయకుడివి. వ్యవసాయాలు దెబ్బతినడావికి కారణం కూలి రేట్లు పెరగడం కాదు. ఆ కూలిలో మాత్రం ఈ ధరలకేమొస్తుంది? గిట్టుబాటు ధరలు లేకపోవడం, అస్తవ్యస్త విధానాలు ఇవన్నిటివల్ల వ్యవసాయాలు దెబ్బతింటున్నాయి. వాళ్ళ పనుల్లో కొన్ని తీవ్ర నిర్ణయాలుండవచ్చు... కాని, అవి పేదజనం కోసం ఉద్దేశించినవే..."

"రాజయ్యా! మంచికో చెడుకో కానిగ, నీకు వాళ్ళ మీద చాలా సానుభూతుంది...

నువ్వంతకంటెక్కువ లోతుకు పోకు. ఇప్పటికే నీ మీద పోలీసుల కండ్లున్నాయి..." అన్నాడు బ్రహ్మం.

"ఉంటే ఉండనియ్యి. చావుకు భయపడడం దేనికి? ఇలా నిస్సారమైన జీవితం గడిపేకంటె ప్రజల కోసం, ఓ మంచి పని కోసం చావడం వల్ల జీవితమైనా సార్థకమవుతుంది..."

"మనం పుట్టింది చావడానిక్కాదు... బతుకడానికి..."

"కావచ్చు... కాని కుక్కలవలె, నక్కలవలె, సందులోని పందులవలె బతకడం కంటె ఓ మంచి కోసం చచ్చినా మంచిదే. నాకు వాళ్ళు చేస్తున్న హింసాత్మక చర్యలు నచ్చవు కాని, ఉద్దేశం నచ్చుతుంది..."

"వాళ్ళు చేస్తున్నవన్నీ మంచి పనులనా నీ అభిప్రాయం?"

"నేను చెప్పాను కదా – వాళ్ళ ఉద్దేశం గొప్పదని... కాకుంటే ప్రాణాలను తృణప్రాయంగా వదులుకోవడాని కెవరు సిద్ధంగా వుంటారు? బలి కావడం తప్పదనీ తెలిసీ అందులో కెళ్తున్నారంటే వార్ని తక్కువగా చూడకూడదు..."

"రాజయ్యా! నువ్వొక్క దిక్కు నుంచే ఆలోచిస్తున్నావు... కాని, ఆదర్శాలను నమ్ముకొని ఎంతమంది ఆ ఉద్యమంలోకి పోతున్నారు...? పదిహేడు, పదినెనిమిదేళ్ళ వయసులో ఆవేశం తప్ప ఆలోచనుంటుందా? కొందరు యువకులు తెలిసీ తెలియక అందులో ఇరుక్కుపోతున్నారంటారు... సిద్ధాంతాలు తెలుసుకొనే అందరూ అందులోకెళితే పరిస్థితిలా వుండదు..." అన్నాడు బ్రహ్మం.

"అవును... కొందరైతే వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి వాళ్ళలో చేరుతున్నారనే వాళ్ళూ వున్నారు..." అన్నాడు నర్సింగు.

"కొన్ని పొరపాట్లు జరుగుతున్న మాట నిజమే... అయితే, మనం వాళ్ళ ఉద్దేశాన్నర్థం చేసుకోవాలి."

"సిద్ధాంతాలన్నీ కాగితాల మీదే... వాటిని ఆచరించినపుడే విలువుంటుంది..."

"ఏంటి మనమీ రోజు ఏవేవో మాట్లాడుకుంటున్నాం... గోడలకు చెవులుంటాయి... బట్టగాల్చి మీదేసే కాలమిది మొన్నటికీ మొన్న వాళ్ళకు అన్నం పెడుతున్నారని, ఇద్దర్ని పట్టుకుపోయారు పోలీసులు..."

"నర్సింగు చాలా భయస్తుడు... ఒకటి మొదలు పెడితే మరొకటి ఎన్నో విషయాలొస్తుంటాయి... మన ప్రాంతంలో ఏ విషయం గూర్చి మాట్లాడటం మొదలుపెట్టినా వాళ్ళ విషయం రాకుండా వుండదు. సరేగాని బ్రహ్మం!... ఇంతకూ నువ్వేం చెయ్యబోతున్నావో చెప్పనే లేదు..."

"నా చదువుకేం నౌకరి దొరుకుతుంది? ఫిజికల్‌గా బాగానే వున్నాను కాబట్టి పోలీసు కానిస్టేబుల్ దొరకొచ్చని మొన్న పడితే అప్లై చేశాను. రాత పరీక్ష శారీరక పరీక్ష అయిపోయాయి. ఆర్డర్ కోసం ఎదురుచూస్తున్నాను..."

అగ్నిగుండంలా వున్న తెలంగాణా ప్రాంతంలో పోలీసులకు, అన్నలకు నువ్వానేనా

అన్నట్టున్న సమయంలో బ్రహ్మం పోలీసు కానిస్టేబుల్‌గా చేరతాననడం అతని మిత్రులిద్దరికీ నచ్చలేదు.

"బ్రహ్మం...! నీకేం పనిలేదా...? నువ్వు కానిస్టేబుల్‌గా చేరడమేంటి...? మన ప్రాంతంలో అదెంత ప్రమాదకరమైందో నీకు తెలియదా...? అన్నలు, పోలీసులు ఒకర్నొకరు చంపుకోవడం రోజూ చూస్తూ కూడా కానిస్టేబుల్‌గా చేరతానంటున్నావా?... వద్దు...వద్దు" అన్నాడు నర్సింగు.

"అందులో చేరి బాగా సంపాదించుకో వచ్చనుకుంటున్నాడేమో బ్రహ్మం...? పుక్కానికి వచ్చే సొమ్ముతో తొందరగా ధనవంతుడు కావచ్చనుకుంటున్నాడు."

"నాకలాంటి దురాశలేం లేవు. నాకు ఊళ్ళో బతికే అవకాశమే వుంటే ఉద్యోగానికి పోయే ప్రసక్తే వుండేది కాదు. నాకిది తప్ప ఏం దొరికే అవకాశం లేదు. దీనికయినా కాంపిటీషన్ బాగానే వుంది. ఇది రావడం కూడా అదృష్టమే."

"ఏమదృష్టమో ఏమో...! నాకయితే పరిస్థితులను చూస్తుంటే ఆ ఉద్యోగం గూర్చి చెబుతుంటేనే వణుకొస్తుంది" అన్నాడు నర్సింగు.

"మనం ఎవరి జోలికీ పోకుంటే మన జోలి కెవరూ రారు. నాకు అన్నల జోలెందుకు? నా డ్యూటీందో నేను చేసుకుంటాను. అయినా, అన్నలు నాలాటి పొట్టకూటికోసం ఉద్యోగాలు చేసేవాళ్ళ జోలికెందుకు పోతారు? పోలీసులంటే ప్రజా రక్షకులని నేను పనిచేసి చూపెడతాను..."

"మొత్తం మీద ఏదేమైనా పోలీసు ఉద్యోగంలోనే చేరుతానంటావు...?"

"పొట్ట తిప్పలకు జెర్రిపోతులాటని ఏదో ఓ పని చేయక తప్పదు కదా...!"

"మరి రాజయ్య సంగతో...?"

"నాకు వాళ్ళ ఉద్దేశ్యం తప్పనిపించడం లేదు. చావో బతుకో నేను అందులోనే తేల్చుకోవాలనుకుంటున్నాను."

ఆ మాటలకు నర్సింగం వణికిపోయాడు.

"రాజయ్యా! నువ్వు మరీ ముళ్ళబాట నెన్నుకుంటున్నావు. ఉత్త బొక్కలకు కొంగ్రిగా డాశపడ్డట్టు వాళ్ళాశించిన సమాజం వచ్చేదెప్పుడు...? ఈ తీవ్రవాదం, రక్తపాతం తగ్గేదెన్నడు?..." అన్నాడు.

"రానియ్యి... రాకపోనియ్యి... ఈ వ్యవస్థను చూస్తున్న నాకు జీవితానికే లక్ష్యం లేకుండా బతకాలనిపించడంలేదు. మంచో, చెడో అందులోంచే తేల్చుకుంటాను..."

"రాజయ్యా! నువ్వలా మాట్లాడకు... వాళ్ళతో సంబంధాలు వదులుకో... ఇదెక్కడికి దారి తీస్తుందో తెలియకుండా వుంది..." అన్నాడు నర్సింగు.

"రాజయ్యా! నీకేదైనా ఉద్యోగం దొరికుంటే లేదా మంచి ఆర్థిక పరిస్థితుండుంటే వాళ్ళలో కలసిపోవడాని కిష్టపడేవాడివా...?"

వాళ్ళ మాటలతో కొద్ది క్షణాలాలోచనలో పడ్డాడు రాజయ్య.

"ఏమో...! ఏం చేసేవాడినో నాకు తెలియదు. ఇప్పుడు మాత్రం నా మార్గమదే... అయితే, నేను తీవ్రవాద చర్యల్లో పాలుపంచుకోను. ఏ హత్యల జోలికీ

పోను. వాళ్ళలో చేరి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ప్రయత్నం చేస్తాను. నా నిర్ణయానికి తిరుగులేదు."

"మీరిద్దరూ ముళ్ళబాటలనే ఎన్నుకున్నారు. నిప్పుల గుండంలో అడుగు పెడుతున్నారు. నాకైతే భయంగానే వుంది. కనీసం మీరిద్దరు ఒకర్నొకరు ఎదుర్కోవాల్సి రావద్దని ఆశిద్దాం..." అన్నాడు నర్సింగు.

"మన ముగ్గురం ఒకరి వల్ల ఒకరికి నష్టం కాకుండా చూసుకుందాం... మన ముగ్గురి మార్గాలు వేరయ్యాయి..."

ఆ ముగ్గురూ వెళ్ళిపోయారక్కణ్ణించి.

☆ ☆ ☆

గాఢంగా అలుముకున్న అమావాస్య చీకటి. కళ్ళు పొడుచుకున్నా గజం దూరంలో వున్న వ్యక్తికూడా కనబడడం లేదు. ఆ గాఢాంధకారానికి తోడు భయంకర నిశ్శబ్దం. అప్పుడప్పుడు కీచురాళ్ళ ధ్వని వినబడుతోంది. దూరంగా వినబడే నక్కల అరుపులు ఆ నిశ్శబ్దాన్ని మరింత భయం గొలిపేలా చేస్తున్నాయి.

ఊరి వెలుపల గుట్టల సమీపంలో వున్న పోలీసుస్టేషన్‌లో అర్ధరాత్రి సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు బ్రహ్మం. చేతిలో లోడ్ చేసున్న తుపాకీని పట్టుకొని అటూ ఇటూ తిరుగుతున్నాడు. గోడ నానుకుని నిల్చుంటున్నాడు. అప్పుడప్పుడు కూర్చుంటున్నాడు.

మూడేళ్ళుగా ఆ స్టేషన్‌లో పని చేస్తున్నాడు బ్రహ్మం. తన బాల్య మిత్రులు, ప్రాణానికి ప్రాణాలైన నర్సింగు, రాజయ్యలను జ్ఞాపకం చేసుకుంటున్నాడు. వాళ్ళు జ్ఞాపకమొస్తే అతనికి దుఃఖమాగడం లేదు.

నర్సింగు...పాపం నర్సింగు... ఊళ్ళోనే వ్యవసాయం చేసుకుంటూ బతకాల నుకున్నాడు. అలాగే బతుకును ప్రారంభించాడు. అతడు కోరుకున్నదేం లేదు... మామూలుగా బతుకు గడిస్తే చాలనుకున్నాడు... కాని, ఏమైంది? ఎంత రాత్రింబవళ్ళు శ్రమించినా కడుపైనా నిండని పరిస్థితి... అప్పులపాలయ్యాడు... అయినా, తన బతుకు తానే బతుకుతున్నాడు. కాని, సమాజమాతన్ని బతుకనీయలేదు. తమ ప్రాంతంలో నాకేం తెలియదంటూ బతుకుదామన్నా సాధ్యంకాదేమో... నర్సింగుకు రాజయ్య స్నేహితుడని అతన్ని వేధించడం మొదలుపెట్టారు పోలీసులు. రాజయ్యను పట్టియ్యాలన్నారు. అతన్ని నానారకాలుగా వేధించడం మొదలుపెట్టారు.

"నాకేం తెలియదు సార్!... నేను రాజయ్యను అందులోకి పోవద్దన్నాను. నాకు వాళ్ళ ఏ విషయమూ తెలియదు... నన్నవసరంగా వేధించకండి..." అని మొత్తుకున్నాడు నర్సింగు. అయినా, ఎవరూ విన్లేదు.

రాజయ్యకు షెల్టర్ ఇస్తున్నాడని, మరికొందరు ఉద్యమకారులకు రాత్రుల్లో తిండి పెడుతున్నాడని నర్సింగును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళారు. అతనికి తెలియని విషయాల గూర్చి చెప్పమని కొట్టారు. ఆ తర్వాత వదిలిపెట్టారు.

ఓ దిక్కు ఆర్థిక దుస్థితి. మరో దిక్కు పోలీసుల వేధింపు భరించలేకపోయాడు నర్సింగు... ఆత్మహత్య చేసుకున్నాడు.

మిత్రుడు నర్సింగు జ్ఞాపకం వచ్చి బ్రహ్మం హృదయం బరువెక్కింది. అక్కడున్న స్టూలుమీద కూర్చున్నాడు.

పాపం, రాజయ్య...! పేద కుటుంబంలోంచి వచ్చినవాడు... వాళ్ళ సిద్ధాంతాల కాకర్షితుడయ్యో, వ్యక్తిగత కారణాల వల్లనో, ఆవేశపూరిత నిర్ణయం వల్లనో ఉద్యమకారుల్లో కలిసిపోయాడు. తాము ముగ్గురారోజు కలుసుకున్నప్పుడు తమతో నేమనన్నాడు...? తాను హింసాయత చర్యలకు పాల్పడనన్నాడు. కాని జరిగిందేమిటి...? అనేక బస్సు దహనాలలో, బాంబు ప్రేలుళ్ళలో, హత్యల్లో అతను పాత్రున్నట్టు తాను పేపర్లో చూశాడు. చీమకైనా అపకారం చేయనివాడు మొదట్లో... అలాంటి రాజయ్యపై ఎన్నో హత్యానేరాలు... బాంబు ప్రేలుళ్ళ కేసులు... తత్ఫలితంగా రహస్య జీవితం... అతని తలపై లక్షల ప్రకటన. అలాంటి రాజయ్య నెల రోజుల క్రితమే పోలీసు ఎన్‌కౌంటర్లో చనిపోయాడని వార్త చదివి తాను దిగ్భ్రాంతుడయ్యాడు. తన ప్రాణమిత్రుడు రాజయ్య చావు తనను కొద్దిరోజులు మనిషిని కానీయలేదు.

రాజయ్య జ్ఞాపకం వచ్చి బ్రహ్మం కళ్లవెంట పటపటా నీళ్ళు కారాయి. చేతుకున్న గడియారంలో సమయం చూశాడు బ్రహ్మం.

మిత్రుణ్ణి లేపి స్టేషన్లో పడుకున్నాడు. ఎంత ప్రయత్నించినా బ్రహ్మంకు నిద్ర పట్టడంలేదు.

ట్రెయినింగయి వచ్చింతర్వాత తాను కానిస్టేబుల్‌గా చేరాడు. చేరింతర్వాత కాని ఆ బతుకులోని విషాదం తనకు తెలిసొచ్చింది కాదు. పైకి ప్రజలను పీక్కుతింటున్నట్టు కనబడే పోలీసులు ఎంత చాకిరీకి, వేదనకు గురి కావల్సివస్తుందో, ఎంత మనసు చంపుకొని బతకాల్సి వస్తుందో తనకు త్వరలోనే అనుభవంలోకొచ్చింది. రోజంతా సెలవనేది లేకుండా వెట్టి చాకిరీలా చేసినా పై అధికార్ల తిట్లు తినాల్సి రావడం తనకు బాధాకరంగానే వుంది. అయినా తప్పడం లేదు. ఉద్యోగంలో చేరకముందు తా నేమనుకున్నాడు? వాళ్ళు చేస్తున్నది మంచో చెడో తనకు తెలియకున్నా వాళ్ళ విషయంలో తాను పట్టించుకోకూడదనుకున్నాడు. రాత్రి గాలింపు చర్యలకు పోనని తాను తిట్లు తిన్నాడు. ఇంకా మాట్లాడితే వాళ్ళతో సంబంధాన్నంటగట్టి ఉద్యోగం తీసెయ్యడమే కాకుండా శిక్షిస్తామని బెదిరించారు. తనకు రాత్రుల్లో గాలింపు చర్యలు తప్పలేదు. రెండుమూడు ఎన్‌కౌంటర్లలో పాల్గొనకా తప్పలేదు. ఫలితంగా తమ పోలీసుస్టేషన్ వాళ్ళ హిట్‌లిస్టులోకి వెళ్ళిపోయింది. అప్పట్నుంచి తాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు.

తన ఇద్దరు మిత్రులూ పోయారు.

తన గతేమవుతుందో తెలియదు...

ఆలోచిస్తూనే నిద్రలోకొరిగాడు బ్రహ్మం...

ఆ నిద్ర బ్రహ్మంకు శాశ్విత నిద్రే అయింది. తెల్లవారుజామున అన్నలా పోలీసుస్టేషన్‌ను పేల్చివేశారు.

బ్రహ్మంతోపాటు మరో నలుగురు కానిస్టేబుళ్ళు తునాతునకలయ్యారు.

నర్సింగు, బ్రహ్మం, రాజయ్య ఎవరూ వర్గ శత్రువులు కారు. వర్గశత్రువును నిర్మూలించాలనుకున్నవాళ్ళూ కారు. వాళ్ళను నిర్మూలించాలనుకునేవాళ్ళను నిర్మూలించాలనుకునేవాళ్ళలోనూ లేరు.

అయినా, ఆ ముగ్గురూ హతమయ్యారు.

ఆ ముగ్గురూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒకే కారణంతో హతమయ్యారు. ఆ ముగ్గురి కుటుంబా లిప్పుడు శోకసంద్రంలో మునిగున్నాయి.

అయితే, బ్రహ్మం కుటుంబానికి ప్రభుత్వం కొంచెం ఆర్థిక సాయం చేసింది. రాజయ్యను గూర్చి ఉద్యమకారులు పాటలు కట్టారు. అమరవీరుడని కీర్తించారు. పోస్టర్లు వేశారు. నర్సింగును మాత్రమెవరూ పట్టించుకోలేదు.

తెలంగాణా గ్రామాల్లో హింస, ప్రతిహింస, రాజ్యహింస పేరుమీద ప్రతిరోజూ నర్సింగులో, రాజయ్యలో, బ్రహ్మంలో ప్రాణాలు కోల్పోతూనే వున్నారు. ప్రభుత్వమూ సమస్యను శాంతిభద్రతల సమస్యగా తప్ప, చూడడానికి సిద్ధంగా లేదు... ఎవర్నెవరు చంపుతున్నారో, ఎందుకు చంపుతున్నారో అనే ప్రశ్నలను ప్రశ్నలుగానే మిగులుస్తూ తెలంగాణా నేల రక్తసిక్తమవుతూనే వుంది...

● *ఆదివారం ఆంధ్రజ్యోతి, 25-1-1998* ●

* * *